AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
8-10-2025 (Wednesday) MAIN EDITION

## రెండు దగ్గు మందులపై నిషేధం



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల కల్తీ దగ్గు మందు తాగి మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 16 మంది చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో రెండు దగ్గు మందులను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రీలైఫ్, రెస్పీ ఫ్రెష్ టీఆర్ మందులను నిషేధించింది. వీటిలో కల్తీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ మందులను విక్రయించొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా.. చిన్నారుల మృతికి కారణమైన కోల్డ్రిఫ్ సిరప్‌ను ఇటీవలే మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది.

## విశాఖలో మరో మెగా ప్రాజెక్ట్..!



**అక్షరటుడే, విశాఖ:** ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగం మరింత పుంజుకోనుంది. ఇప్పటికే విశాఖపట్నం వైపు ఐటీ దిగ్గజాలు మొగ్గుచూపుతుండగా, తాజాగా మరో భారీ ప్రాజెక్ట్ వచ్చే అవకాశం కనిపిస్తోంది. అమెరికా టెక్ దిగ్గజం గూగుల్ ఎల్ఎల్‌సీకు అనుబంధంగా పనిచేస్తున్న రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ.. విశాఖలో భారీస్థాయి ఏఐ పవర్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపింది. రూ.87,250 కోట్ల పెట్టుబడితో 1,000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్‌ను స్థాపించేందుకు ప్రతిపాదనలు సమర్పించింది.

## వివో నుంచి కొత్త ఫోన్..




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ అయిన వివో భారీ కెమెరాతో కొత్త స్మార్ట్ ఫోన్‌ను లాంచ్ చేసింది. వీ60ఈ పేరిట తీసుకువచ్చిన ఈ మోడల్ కంపెనీ ఆన్‌లైన్ స్టోర్‌తో పాటు అధికారిక రిటైల్ స్టోర్‌లలో లభ్యమవుతుంది. 8 GB ర్యామ్, 12 GB ర్యామ్ వేరియంట్లు ఉన్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో క్రెడిట్ కార్డు ఆఫర్లు ఇస్తున్నాయి.

## బాణసంచా పేలి ఏడుగురి మృతి



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్‌లోని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఓ బాణాసంచా తయారీ పరిశ్రమలో పేలుడు చోటు చేసుకుంది. దీంతో అందులో ఉన్న ఏడుగురు మృతి చెందారు. కాగా.. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

## రోడ్ల మరమ్మతులకు రూ.వెయ్యి కోట్లు



**అక్షరటుడే, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 274 రహదారుల మరమ్మతుల కోసం రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పాలనాపరమైన అనుమతులు జారీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

## మోహన్‌బాబు వర్సిటీకి భారీ జరిమానా




**అక్షరటుడే, ఆంధ్రప్రదేశ్:** టాలీవుడ్ ప్రముఖుడు మంచు మోహన్‌బాబుకు చెందిన మోహన్‌బాబు యూనివర్సిటీ తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ విచారణలో ఆయన యూనివర్సిటీ.. 2022-23 నుంచి 2024 వరకు కన్వీనర్ కోటా కింద విద్యార్థుల నుంచి అధికంగా రూ.26 కోట్లకు పైగా ఫీజులు వసూలు చేసిందని నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయంపై రూ.15 లక్షల జరిమానా విధించడమే కాక, అదనంగా వసూలు చేసిన రూ.26.17 కోట్లను 15 రోజుల్లో విద్యార్థులకు తిరిగి చెల్లించాలని కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఇదే కాక, యూనివర్సిటీకి మంజూరైన గుర్తింపును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి, యూజీసీ, ఏఐసీటీఈ, పీసీఐ వంటి జాతీయ స్థాయి విద్యా నియంత్రణ సంస్థలకు కమిషన్ సిఫారసు చేసింది.

## పుప్పాలగూడలో హైడ్రా కూల్చివేతలు



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ నగరంలో హైడ్రా మరోసారి కూల్చివేతలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. పుప్పాలగూడలో ప్రభుత్వ భూమిపై కొందరు కబ్జాదారులు కన్నేశారు. 500 గజాల స్థలాన్ని ఆక్రమించి ఐదు ప్లాట్లుగా చేశారు. అందులో షెడ్లు సైతం నిర్మించారు. దీనిపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆక్రమణలను తొలగించారు. అయితే అక్రమ నిర్మాణాలను తొలగిస్తుండగా.. స్థానికులు అడ్డుకోవడంతో ఉద్రిక్తంగా మారింది. అప్పటికే భారీగా పోలీసులు ఘటనా స్థలంలో మోహరించారు. జేసీబీలను అడ్డుకున్న వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆ భూమిలో ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలం అని బోర్డు ఏర్పాటు చేశారు.



# హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ

- బీసీ రిజర్వేషన్లపై కొనసాగిన విచారణ
- ఇరుపక్షాల వాదనలు
- విచారణ రేపటికి వాయిదా

**బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ సాగింది. రిజర్వేనషన్లకు వ్యతిరేకంగా పలువురు కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయం విదితమే. దీనికి వ్యతిరేకంగా మాధవరెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఆయనతో పాటు పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే రిజర్వేషన్లకు మద్దతుగా కూడా ఆర్ కృష్ణయ్య, ఇతరులు పిటిషన్లు వేశారు. మొత్తం ఆరు పిటిషన్లపై విచారణ చేపట్టిన కోర్టు తీర్పును రేపటికి వాయిదా వేసింది.**

**– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

బీసీ రిజర్వేషన్లపై వాడివేడీ విచారణ జరుగుతోంది. మొదట పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50శాతం రిజర్వేషన్లు దాటొద్దని వారు పేర్కొన్నారు. 'కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన జీవో ప్రకారం 67 శాతానికి రిజర్వేషన్లు పెరిగాయి. బీసీలకు 42, ఎస్సీ ఎస్టీలకు 25 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉండగా జీవో తీసుకొచ్చారు' పిటిషనర్లు వాదించారు.

ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా రిజర్వేషన్ అమలు చేస్తోందని పేర్కొన్నారు. ట్రిపుల్ టెస్ట్‌ను పాటించకుండా రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లపై చట్టం చేయలేవని కోర్టు దృష్టికి తెచ్చారు. తమకు స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవాలనే ఉద్దేశం లేదని, చట్ట ప్రకారం రిజర్వేషన్లు ఉండాలన్నదే తమ ఉద్దేశం అన్నారు. అయితే రిజర్వేషన్ల పరిమితి 50 శాతం మించితే.. ఎన్నికలు రద్దవుతాయని సుప్రీంకోర్టు నిబంధన ఉందని పిటిషనర్ తరఫు లాయర్ గుర్తు చేశారు.

### న్యాయం చేయడం కోసమే..

కుల గణన ద్వారా బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రిజర్వేషన్ పెంచినట్లు అడ్వొకేట్ జనరల్ తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్‌తో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా న్యాయం చేయడం సాధ్యమవుతుందని కోర్టుకు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ఉందని సింఘ్వి వాదించారు. మొదట పిటిషనర్ తరఫు లాయర్లు వాదించగా.. లంచ్ బ్రేక్ తర్వాత ప్రభుత్వం తరఫున వాదనలు ప్రారంభం అయ్యాయి. సింఘ్వి వాదిస్తూ.. రిజర్వేషన్ల బిల్లును అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయని కోర్టుకు తెలిపారు. జీవోపై స్టే ఇవ్వాలని కోరడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కోర్టు ఇదే చివరి విచారణ కాదని పేర్కొంది. అన్ని అంశాలను ఇప్పుడే ప్రస్తావించొద్దని సూచించింది. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును రేపటికి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

## అడ్లూరికి క్షమాపణలు చెప్పిన పొన్నం..



**అక్షరటుడే, హైదరాబాద్:** మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో నెలకొన్న వివాదానికి మంత్రి పొన్నం ప్రభాకర్ తెరదించారు. తాను ఆ వ్యాఖ్యలు అనలేదని, కానీ పత్రికల్లో వచ్చిన వార్తలతో అడ్లూరి లక్ష్మణ్ బాధ పడి ఉంటే క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు. తన వ్యాఖ్యలను రాజకీయ దురుద్దేశంతో వక్రీకరించారని పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అడ్లూరి లక్ష్మణ్‌తో తనకు 30 ఏళ్ల అనుబంధముందని చెప్పారు. ఆయన మనసు నొచ్చుకున్నందుకు తాను విచారం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అడ్లూరి తనకు సోదర సమానుడని, ఆయనను కించపరిచే ఉద్దేశం లేదన్నారు. తన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని పేర్కొన్నారు.

## నిరుద్యోగుల గోస పట్టని ప్రభుత్వం: కవిత



**అక్షరటుడే, హైదరాబాద్:** గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం గన్‌పార్క్ వద్ద నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వంపై మండిపడ్డారు. నిరుద్యోగుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌లో కొందరికి ఉద్యోగాలు ఇవ్వడానికి గ్రూప్-1 పరీక్ష పెట్టారా? అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు వాళ్లనే మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థులు.. ఉద్యోగాలు వచ్చిన వారి పేపర్లు బయట పెట్టాలని కోరుతున్నారని కవిత అన్నారు. ఆ మేరకు వారి పేపర్లు బయట పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో వెలువడిన నోటిఫికేషన్లకు సంబంధించి 50 వేల ఉద్యోగాలు సైతం తామే ఇచ్చినట్లు రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాలని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## భారత్‌పై పాక్ మంత్రి అనుచిత వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారతదేశంపై విషం కక్కారు. పొరుగు దేశంతో మరో యుద్ధం జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఖవాజా భారత్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. ఇండియాతో గతంలో జరిగిన నాలుగు యుద్ధాల్లో ఓటమి చెందినప్పటికీ, భవిష్యత్తులో జరిగే పోరాటంలో మాత్రం మెరుగైన ఫలితం సాధిస్తామని చెప్పారు. తద్వారా మరో యుద్ధం తప్పదన్న రీతిలో వ్యాఖ్యలు చేశారు. "భారతదేశం ఎప్పుడూ ఐక్య దేశంగా లేదని చరిత్ర చెబుతోంది. కొంతకాలం ఔరంగజేబు పాలనలో తప్ప ఎప్పుడూ ఐక్యంగా లేదు. చాలా భిన్నాభిప్రాయాలు ఉంటాయి. కానీ పాకిస్థాన్ మాత్రం అల్లా పేరు మీద సృష్టించబడింది. స్వదేశంలో మనలో మనం వాదనలు చేసుకుంటాం. పోటీ పడతాం. కానీ ఇండియాతో పోరాట సమయంలో మాత్రం మనమంతా కలిసే ఉంటాం" అని ఆసిఫ్ పేర్కొనడం గమనార్హం.

## మోదీకి లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ బెదిరింపులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆపరేషన్ సిందూర్‌తో చావు దెబ్బ తిన్నా.. పాకిస్థాన్, ఆ దేశ ఉగ్రవాదులకు బుద్ధి రావడం లేదు. లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ సైపుల్లా కసూరి కవ్వింపు వ్యాఖ్యలు చేశాడు. మరోసారి పహల్గామ్‌లాంటి దాడి చేస్తామని అన్నాడు. పాక్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ భారత్ నీటి ఉగ్రవాదానికి పాల్పడుతోందని ఆరోపించాడు. ఉద్దేశపూర్వకంగా నీటిని విడుదల చేసి పాక్‌లో వరదలు రావడానికి కారణం అవుతోందన్నాడు. "మే 10న మనం చేసినట్లుగా.. మళ్లీ మోదీకి పాఠం నేర్పించండి" అని ఆ దేశ ఆర్మీ చీఫ్‌ను కోరాడు.

## దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ నివాసాల్లో ఈడీ సోదాలు




**అక్షరటుడే, సినిమా డెస్క్:** దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రముఖ నటులైన దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చకల్‌కల్ ఇళ్లలో ఈడీ దాడులు చేసింది. లగ్జరీ కార్ల స్మగ్లింగ్ కేసు నేపథ్యంలో వీరి నివాసాల్లో అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఈ కేసులో కీలకమైన ఆర్థిక లావాదేవీలపై విచారణ చేపట్టినట్లు సమాచారం. భూటాన్ ఆర్మీకి చెందిన ఖరీదైన వాహనాల వ్యవహారంలో ఈ దాడులు జరిపినట్టు సమాచారం. భూటాన్ సైన్యం తన వాహనశ్రేణిలోని కొన్ని లగ్జరీ కార్లను ఉపసంహరించుకున్న తర్వాత, వాటిని వేలంలో భాగంగా చాలా తక్కువ ధరలకు కొందరు వ్యక్తులు సొంతం చేసుకున్నారు. అనంతరం వీటిని కస్టమ్స్ డ్యూటీ చెల్లించకుండా భారత్‌కు స్మగ్లింగ్ చేశారని ఈడీ అనుమానిస్తోంది. ఈ కార్లను కొంతమంది ప్రముఖులకు విక్రయించినట్లు గుర్తించిన ఈడీ.. ఈ దిశగా దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగానే మలయాళ సూపర్‌స్టార్లు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ నివాసాల్లో సోదాలు జరిగాయి.

## డైరెక్టర్‌ను తమ్ముడు అనేసిన.. రితిక నాయక్!



**డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేసిన తాజా చిత్రం 'మిరాయ్'. ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ దగ్గర భారీ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. ఈ మూవీలో రితిక నాయక్ నటించింది. అయితే ఈ అమ్మడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయం తెలిపింది. డైరెక్టర్ కార్తీక్ గురించి మాట్లాడుతూ.. 'సెట్స్‌లో నేను కార్తీక్‌ని తమ్ముడు అని పిలిచేదాన్ని. నాది అక్టోబర్ 27 పుట్టినరోజు. అయితే, కార్తీక్‌ది అక్టోబర్ 28. ఒక రోజు తేడాతోనే అతను నా తమ్ముడు అయిపోయాడు' అని చెప్పుకొచ్చింది ఈ ముద్దుగుమ్మ.**

**–అక్షరటుడే, సినిమా డెస్క్**